

వర్ధన్నపేటలో రైతు దీక్షలో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

రైతు ఆత్మహత్య ఘటనలో సర్వేయర్ రిమాండ్

బచ్చన్నపేట, ఏప్రిల్ 6 : రైతు ఆత్మహత్యకు కారణమైన ఘటనలో సర్వేయర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను శనివారం ఆయన విలేకరులకు తెలిపారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్‌కు చెందిన రైతు కొమ్మాటి రఘుపతికి చెందిన ఎకరం 20 గంటల భూమిని రికార్డుల్లో నమోదు చేయించాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. పట్టాదారు పాస్‌బుక్ ఇవ్వలేదు. దీంతో మనస్తాపానికి గురైన రఘుపతి గత నెల 22న ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై రైతులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించడంతో అధికార యంత్రాంగం స్పందించి విచారణ జరిపి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందించింది. ఈ నేపథ్యంలో రఘుపతి ఆత్మహత్యకు కారణమైన సర్వేయర్ రవీందర్‌ను శనివారం కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై సతీశ్ వెల్లడించారు. మరో నిందితుడైన సీనియర్ అసిస్టెంట్ సుమన్ పరారీలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఆతడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు.



జనగామలో నిర్వహించిన పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామలో ప్లకార్డుతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకురాలు

బోనస్, పరిహారం ఇవ్వాల్సిందే..

పాలకుర్తిలో రైతు దీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కాంగ్రెస్ సర్కారు తీరుపై భగ్గుమన్న బీఆర్ఎస్

- రైతులకిచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్
- మద్దతు ధర, రూ.500 బోనస్, ఎకరానికి రూ.25వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ ఒక్కరోజు దీక్షలు
- నియోజకవర్గ కేంద్రాల్లో మిన్నంటిన నిరసనలు
- పాల్గొన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

రైతుల కోసం బీఆర్ఎస్ నేతలు కదంతొక్కారు. పంటలకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇవ్వడంతో పాటు ఎండిపోయిన పంటలకు రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలనే డిమాండ్‌తో రైతులకు మద్దతుగా శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతు దీక్షలు నిర్వహించారు. ఎక్కడికక్కడ నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని కాంగ్రెస్ అసమర్థ పాలనపై దుమ్మెత్తి పోశారు. ఎండిపోయిన వరి, మక్కజొన్న మెదలతో దీక్షా శిబిరంలో బైఠాయించి ప్లకార్డులు చేతబట్టుకొని నినాదాలతో హోరెత్తించారు.

- నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 6

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా శనివారం రైతు నిరసన దీక్షలు నిర్వహించారు. జనగామ జిల్లా పాలకుర్తిలోని రాజీవ్ చౌరస్తాలో చేపట్టిన దీక్షలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో పంటలు ఎండిపోలేదని అత్తాకోడళ్లు మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి ముందుచూపు లేకపోవడం, నిర్లక్ష్యంతోనే పంటలు ఎండిపోయాయని విమర్శించారు. ఎండిన పంటలను చూపించేందుకు తాను సిద్ధమని, అత్తాకొడళ్లు సిద్ధమా అని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి సీఎం పదవి చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో 216మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఎండిన పంటలకు రూ.25వేల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు ఆరుగాలం పండించిన వరి పంటలకు రూ.500 బోనస్ ప్రకటించాలని కోరారు. అలాగే మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌తో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ దీక్షలో పాల్గొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎన్నడూ పాలలు ఎండిపోయిన దాఖలాల్లేవన్నారు. కాళేశ్వరంలో నీళ్లున్నా వదలకుండా రైతుల పొలాలు ఎండిపోయేలా చేయడమే కాకుండా కేసీఆర్‌ను బదనాం చేస్తున్నాడని సత్యవతి మండిపడ్డారు. అలాగే మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డితో కలిసి జనగామ జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా వద్ద, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతీ హామీని వెంటనే నెరవేర్చాలని పల్లా డిమాండ్ చేశారు. రైతులకు వెంటనే రూ.2లక్షల రుణ మాఫీ చేయాలని, రైతుబంధు నిధులు ఖాతాల్లో జమ చేయాలని, కౌలు రైతులకు హామీ మేరకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి మద్దతు ధర అందించడంతోపాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల సాగునీరు అందక పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం అందించాలన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని అంబేద్కర్ సెంటర్‌లో మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పాల్గొని 420 హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లోనే అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత పాల్గొని అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ పార్టీ తీరును ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే రైతుల ఆత్మహత్యలు ఎక్కువయ్యాయని ఆ పార్టీకి రైతుల ఉసురు తప్పక తాకుతుందని భూపాలపల్లిలో నిర్వహించిన దీక్షలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పాల్గొని కాంగెస్ సర్కారు తీరుపై మండిపడ్డారు.

భూపాలపల్లిలో దీక్షలో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

నెల్లికుదురులో రైతు దీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

నర్సంపేటలో మాట్లాడుతున్న ఎంపీ మాలోత్ కవిత

నర్సంపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ మాలోత్ కవిత

యువోత్సాహం

నిట్‌లో స్ప్రింగ్‌స్ప్రీ జోష్

- ఆలోచింపజేసిన ఈవెంట్ల ప్రదర్శన
- అలరించిన సింగర్ నకాష్ అజీజ్
- ఫ్యాషన్ షో అదుర్స్

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 6 : ఎన్ఐటీ వరంగల్‌లో స్ప్రింగ్‌స్ప్రీ వేడుకలు విద్యార్థుల్లో జోష్ నింపుతున్నాయి. రాసెంగాన్ కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా రెండో రోజు విద్యార్థులు అందరినీ ఆలోచింపజేసే ఈవెంట్లను ప్రదర్శించారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులతో నిట్ క్యాంపస్ సందడిగా మారింది. విద్యార్థులు పోటీపడి మరీ ఈవెంట్లను ప్రదర్శించా రు. సరదా గేమ్స్.. మెదడుకు పదును పెట్టే ఈవెంట్లు.. ప్రో షోలు, ఫ్యాషన్ షోలు ఉత్సాహాన్ని నింపాయి. రాత్రి ప్రో షోలు నిర్వహించారు. ప్రసిద్ధ నేపథ్య గాయకుడు నకాష్ అజీజ్ పాటలతో అందరినీ అలరించారు. తర్వాత లోహార్– ది బ్లాక్‌స్మిత్ అనే ప్రముఖ బ్యాండ్ కూడా ప్రో షోలో పాల్గొని ప్రదర్శించారు. ఆదివారం నటుడు, నిర్మాత నవదీప్ పాల్గొననున్నారు. డైరెక్టర్స్ కట్ సందర్భంగా సీతారామం సినిమా డైరెక్టర్ హను రాఘవపూడి పార్టిసిపెంట్స్‌తో ఇంటరాక్ట్ కానున్నారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య పాల్గొన్నారు. సోలో ఐడల్, వాట్స్ డిఫరెంట్, హంగర్ గేమ్స్, ఫిల్మ్ హంట్, మాస్టర్ చెఫ్, హిస్పోల, కరోకే, వాక్ రసరంగం, ఫొటో ఫజిల్ వంటి ఈవెంట్లు నిర్వహించారు. కాగా, నిట్ అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో నిర్వహించిన టాక్ షోలో సినీ నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా పాల్గొని తన అనుభవాలను వివరించారు. అలాగే, గామీ చిత్ర దర్శకుడు విద్యాధర్ కూ డా తన గురించి వివరించి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. అలాగే, నిట్‌లో ఫ్యాషన్‌షో అదిరింది. విద్యార్థులు ర్యాంప్‌పై క్యాట్‌వాక్ చేస్తూ హొయలొలికించారు. స్ప్రింగ్‌స్ప్రీలో ఫ్యాషన్ షో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచింది. నిట్ విద్యార్థులు విభిన్న డిజైన్ దుస్తులు ధరించి లేటెస్ట్ స్టైలిష్ క్యాస్టూమ్స్‌తో అదరగొట్టారు.

ఫ్యాషన్ షోలో యువతీయువకులు

కేరింతలు కొడుతున్న విద్యార్థులు

పాటలు పాడుతున్న సింగర్ నకాష్ అజీజ్

సూర్య@44.4

నిప్పులకొలిమిలా ఉమ్మడి జిల్లా

- గరిష్ఠ ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరిబిక్కిరి
- ములుగు, మానుకోటలో రికార్డు టెంపరేచర్

భానుడి భగభగతో ఉమ్మడి జిల్లా నిప్పులకొలిమిలా మారింది. రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు అంతకకంతకూ పెరుగుతుండగా శనివారం రికార్డు స్థాయిలో 45 డిగ్రీలకు చేరువైంది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ, ములుగు జిల్లా మేడారంలో 44.4 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూరులో 43.9, జనగామ జిల్లా పాలకుర్తిలో 43.7, వరంగల్ జిల్లా గొర్రెకుంటలో 43.6 హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌లో 43.5 డిగ్రీలు నమోదైంది. ఎండ వేడిమి జనం ఉక్కిరిబిక్కిరి అవుతుండగా మధ్యాహ్నం వేళ అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

హనుమకొండలో..